# ఇంగిలీషు చదువు

[నూరేళ్ళ కిందట]

పెద్దకొడుకు: ఏంనాన్నా ఇవాళ ప్రవేశ పెట్టాడయ్యా బాబయ్యమరేమో చిన్నాణ్ణి మిషన్‌స్కూల్లో.

తండ్రి: వాడన్నంతపనీ చేశాడురా, ఎవడుచెప్పినా వినకుండా వున్నాడురా.

పెద్ద: ఏమిటయ్యా అలాగంటావు? చిన్నవాడికి మంచి మంచి పుస్తకాలన్నీ కొనిచ్చాడయ్యా! నేనూ దగ్గిరేవున్నా. రావిపాటి గురుమూర్తి శాస్త్రులుగారి పంచతంత్రకధ ఒకటి, పుదూరి సీతారామశాస్త్రిగారు కొత్తగారాసిన పెద్దబాలశిక్ష ఒకటి. దీంట్లో కొంతభాగం చదవాలిట. ఆతర్వాత మదరాసు పాఠ్యపుస్తక నిర్ణయసమితివారు పదమూడేళ్ళ కిందట అంటే 1821 లో అచ్చువేసిన 'వేడుక కధలు' ఒకటి. ఈ పుస్తకం అప్పటినుంచి ఇప్పటివరకూ మారలేదు. 'బైబిల్‌బుక్కు' ఒక్కటి. ఇవీ పాఠ్యపుస్తకాలు.

చిన్నకొడుకు: ఏంనాన్నా అచ్చువి చదివితే పాపంకాదు? అన్నయ్యకింకా తెలియదుకాని.

తండ్రి: అసలు అచ్చు, బైబిలుకోసం పుట్టిందిరా. బైబుల్ వెయ్యడానికేగాని అచ్చుమరెందుకూ పనికిరాదురా.

చిన్న: దొరలు వేదంకూడా అచ్చువేశారుట కాదూ నానా?

తండ్రి; వేశారు! వాళ్ళ మొహంవేశారు! అన్నీ తప్పులే చెప్పారు మనవాళ్ళు. మనవాళ్ళేం తెలివితక్కువ వాళ్ళట్రా, వాళ్ళడగగానే చెప్పడానికి. వాళ్ళడిగిన దొకటి మనవాళ్ళు

* వీణ జూన్ 1938

చెప్పినదొకటీ. అంచేత ఆ అచ్చువేయించిన దొరముండావాడు ఆ తర్వాత మొత్తుకుని ఏడ్చాడు.

చిన్న: (అన్నతో) ఇప్పటికేనా తెలుసుకున్నావా, అచ్చు వేసిన పుస్తకం చదివితే పాపమొస్తుందని.

పెద్ద: సరేలే.

తండ్రి: అంచేతేరా మనం అచ్చుపుస్తకాలు చదవకూడదు. అచ్చువేసిన రామాయణం పారాయణపనికిరాదు కదా. అచ్చు వేసిన పుస్తకం మడిబట్టతో ముట్టుకోకూడదుకదా అరవవాళ్లు తెలియక పుస్తకాలు అచ్చువేయించు కుంటున్నారుగాని మన వాళ్ళుచూడు ఎంత బుద్ధిమంతులో! ఎక్కడేనా పుస్తకాలు అచ్చువేయించుకుంటున్నారోమో చూడు. ఏక్కడో కాని పుస్తకంఅచ్చు పడకుండావుంది తెలుగులో.

పెద్ద: అచ్చు వేయించుకున్న పుస్తకం చదివితే ఎంతో బాగుంటుందయ్యా!

తండ్రి: ఈ మిషన్ వాళ్ళువచ్చి అచ్చు మొదలెట్టారురా. బైబిల్ అచ్చువేయించడం ఆపళంగా అందరినీ మతంలో కల వడం.

చిన్న: (తండ్రితో) మిషన్ స్కూళ్ళలో బైబిల్ మొట్ట మొదట చెప్తారుటయ్యా. మనవీధిబళ్ళు ఎంతోనయం నాన్నా. మనవీధిబళ్ళలో చస్తేఇంగ్లీషు చదువుండదు. ఏదోమనకు కావల సిన తెలుగుముక్కలు నాలుగునేర్పుతారు. అదిచాలదూ? ఈ సంగతి అన్నయ్యకి తెలియదయ్యా. నేను మొన్న రోడ్డుమీద నడిచి వస్తూవుంటే ఒక మిషనరీ పట్టపగలు పెద్దపెద్ద కేకలువేసు కుంటూ వస్తున్నాడు. ఏమనీ 'మీరంతా చీకట్లోవున్నారు. వెలుగులోకి రండి' అని. ఫీడికిగాని పిచ్చెత్తిందా యేమిటని అను

కున్నాను. మనమంతా చీకట్లో వున్నాంట, వాడొక్కడే వెలుగులో దొర్లుతున్నాడుట.

తండ్రి: (నవ్వి) వాడి మొఖంలాగుంది. వాడి మొఖమని.

చిన్న: దొరలంటే మాలొళ్ళు కాదు నాన్నా? లేకపోతే మాలొళ్ళని వాళ్ళమతంలో ఎందుకు చేర్చుకుంటారు?

తండ్రి: ఔనురా, వాళ్ళని ముట్టుకుంటే స్నానం చెయ్యాలి.

చిన్న: వాళ్ళభాష మాలభాషే.

తండ్రి: ఆ అందుకే అది మనం నేర్చుకోగూడదు.

పెద్ద: (తమ్ముడితో) ఓయ్. ఇప్పుడు వాళ్ళే మనమెడమీద కూచుని పాలిస్తున్నారు. అది తెలియకుండా వుందినీకు.

చిన్న: ఔను. తురకలుపాలిస్తే మనంమేమి చేశాం. జాతి వాళ్ళు పాలించినా అంతేచేస్తాం. ఎవడుపాలిస్తే మనకేమిట్రా?

పెద్ద: ఏమిటా? పాలించేవాళ్ళభాష నేర్చుకోవాలిమనం. వాళ్ళచదువు చదువుకోవాలి మనం.

తండ్రి: ఈ ఇంగ్లీషుచదువు వచ్చాక బొత్తిగా చెడిపోయిందిరా దేశం.

పెద్ద: ఇంగ్లీషుచదువువల్లే కాదూ నాలుగురాళ్ళు సంపాదించుకోడం. ఏ కుంపెనీలో దుబాసిగావున్నా ఏ కోర్టులో దుబాసిగాచేరినా నాలుగురాళ్లు సంపాదించుకోవచ్చు. ఇప్పుడు పారసీకం ఎవడికి కావాలయ్యా. అది రాజభాష అన్నమాటే గాని పొట్ట గడవడానికేమేనా పనికొస్తుందా? పొట్టగడవడానికి మళ్ళా ఇంగ్లీషే నేర్చుకోవాలి.

చిన్న: ఈ ఇంగ్లీషుచదువంతా రామమోహన్‌రాయ్ తెచ్చిపెట్టాడుట. నాన్నా అంతేనా?

తండ్రి: అంతే సహగమనం వద్దన్నాడు ఆ దొరగారే.

ఆ దొరగారే తెచ్చిపెట్టాడు ఇంగ్లీషుచదువు, గవర్నమెంటు వాళ్ళతో దెబ్బలాడి మరీని.

చిన్న: ఆడాళ్ళకీ అబ్రాహ్మణులకి చదువులేక పోడంచేతే మనం చెడిపోతున్నాంట.

తండ్రి: ఏడిశాడులే! ఆయనగారికి విగ్రహారాధన పనికి రాదుట. ఏదో బ్రహ్మమతం మనమతంకంటే బాగుంటుందిట.

చిన్న: అంచేతే ఇంట్లోంచి తరిమేశారు. దేశాలంబట నాలుగేళ్ళపాటు తిరిగాడు. ఇంతకీ ఆయన కిరస్తాని అయ్యా. ఆసంగతి ఎవరికీ తెలియదు.

పెద్ద: ఆయన కిరస్తానీలతో దెబ్బలాడుతూ వుంటేనే, మీ మతంప్రకారం మీరు నడుచుకోడంలేదని. ఆసంగతి నీకు తెలుసా? (తండ్రితో) ఏం నాన్నా?

తండ్రి: అదీ ఒక తమాషాయేరా. ఉత్తరదేశంలో వుండే కొన్నికొన్ని దురాచారాలు మాన్పించాడులే పాపం. శాక్తేయులిచ్చే నరబలులు, వైష్ణవమతస్థుల ముతాకోరుతనం, చంటిపిల్లల్ని చంపడం, బహుభార్యాత్వం మొదలైనవి. కాని సతి మాన్పించడం ఆడవాళ్ళనీ శూద్రుల్నీ చదువుకోమనడం, విగ్రహారాధన వద్దనడం, ఇటువంటివి ఎమిట్రా శుద్ధ తెలివితక్కువతనంకాని. ఈ ఇంగ్లీషుచదువువచ్చాక దేశమంతా చెడిపోతూందిరా!

చిన్న: చూశావు నాన్నా ఇప్పుడంతా కొంతమంది పెద్దలు దొరవేషం వేస్తున్నారు, క్రాపింగు పెట్టించుకుంటున్నారు.

తండ్రి: కిరస్తానీమతంలో చేరిపోయారన్నమాటే. దొరవేషంవెయ్యడం, క్రాపింగు పెట్టించుకోడమంటే కిరస్తానీ మతంలో చేరిపోడమన్నమాటే. ఇంకేముంది నెత్తిమీది నీళ్ళు

చల్లించుకోడమేగా తరవాయి.

చిన్న: అంతేకాదు నాన్నా, వాళ్ళు ఇంగ్లీషు తెలుగు కలిపి మాట్లాడతారయ్యా. వాళ్లకి దేవుడూ దెయ్యమంటూ లేదుట.

పెద్ద: ఔనురా! తురకం తెలుగు కలిపి మాట్లాడేబదులు ఇంగ్లీషు తెలుగూ కలిపి మాట్లాడుతున్నారు. తప్పేముంది. తురకలు రాజులయినప్పుడు తురకం తెలుగు కలిపి మాట్లాడారు. ఇంగ్లీషువాళ్ళు రాజులయినప్పుడు ఇంగ్లీషూ, తెలుగు కలిపి మాట్లాడుతున్నారు.

చిన్న: (తండ్రితో) ఈ మిషన్ బళ్ళన్నిపోవాలయ్యా.

తండ్రి: నువ్వనేదేమిటి ఎవళ్ళూ వెళ్ళకపోతే నాలంతటవే పోతాయి.

చిన్న: మనవాళ్ళే వెళుతున్నారయ్యా మాకింగ్లీషునేర్పమని.

తండ్రి: మరి మీ బాబయ్యకొడుకుని తీసికెళ్ళి ప్రవేశ పెట్టాడు కదూ.

చిన్న: అదేమిటో మహాగొప్పగాచెప్పగొచ్చాడు అన్నయ్య ...... ఔనుగాని నాన్నా బ్రౌన్‌దొరగారు చాలామందికి డబ్బిస్తున్నాడు కేమిటి? బ్రాహ్మలందరికీ సంభావన లిస్తున్నాడట.

తండ్రి: మంచిముండావాడు పాపం పండితులనందరినీ దగ్గిరికిచేర్చి డబ్బిస్తున్నాడు.

చిన్న: ఎవడయ్యా ఇంకో జెవడో కైఫియత్తులన్నీ రాయిస్తున్నాడుట.

తండ్రి: మెకంజీదొర. ఏయే ప్రాంతాలవారిచరిత్ర ఆయా ప్రాంతాలవారిచేత రాయించి జాగ్రత్తపెట్టిస్తున్నాడు.

చిన్న: ఇందులో స్వార్థమేమైనా వుందేమిటి ?

తండ్రి: ఉండకేం ఏదో వుంటుంది.

పెద్ద: స్వార్థమేముంది? మన చరిత్ర మనకి తెలియచెయ్యడమే స్వార్థం. అంతకంటే మరేంలేదు.

తండ్రి: అంతేకాదురా. అంతకంటే మరేదో వుంటుంది. మనం చెప్పలేం కాని.

చిన్న: అన్నయ్యకిలాంటివన్నీ తెలియవు నాన్నా.

పెద్ద: ఏడిశావులే.

చిన్న: పోస్సై. ఇంగ్లీషుచదువులో వుండే దగా నీకు తెలియదు.

పెద్ద: నీకు తెలుసులే మహా.

చిన్న: ఆఁ నిజమే.

పెద్ద: సంతోషించానులే.

తండ్రి: ఊరుకోండిరా దెబ్బలాడక.

---

## నూరేళ్లకిందట - సాహిత్యం.

‘ఏం మామయ్యా! నా ప్రబంధం శాస్త్రసరిచూసి పెట్టవయ్యా! నీతో చెప్తానే ఉన్నాను. వీలుకలగచేసుకుని శాస్త్ర చూసి పెట్టవయ్యా అని’

‘ఏం పుస్తకంరా నువ్వనేది?’

‘అప్పుడే మరుపా! ఆరి దీనమ్మకడుపు కాలా! ఏడాదినుంచి చెప్తున్నాను కాదుటయ్యా!’

‘నీకుర్రతనం పుస్తకంపేరు అట్టే పునశ్చరణ చేస్తున్నాననుకున్నావేమిటి!’